క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్



బచ్చన్నపేట: కేంద్ర క్యాబినెట్ మంత్రి శర్బానంద సోనావాల్‌ను వాస్విక్ ఫౌండేషన్ గ్రూప్స్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గురించి మంత్రికి వివరించామన్నారు. ప్రజలకు సేవ చేసే వారిని ఎల్లప్పుడూ అభినందిస్తానని, అలాగే తన వంతుగా ఫౌండేషన్‌కు సహాయ సహకారాలు కూడా అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు అడ్వకేట్ రవీంద్రనాథ్, బీజేపీ కార్యదర్శి శివ, జాతీయ కిసాన్ కోఆర్డినేటర్ నవనీత్‌సింగ్, ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమిటీని అభినందించిన ఎమ్మెల్యే

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గౌడ సంఘం నూతన కమిటీని ఎమ్మెల్యే రాజయ్య స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గౌడ సంఘం అధ్యక్షులు కోరుకొప్పుల రాజుగౌడ్, ఉపాధ్యక్షులు పులి ధనంజయగౌడ్, డైరక్టర్లు వడ్లకొండ మధు, దూరి నవీన్, బొల్లెపల్లి రాజు, బైరు రాజు, మూల సారయ్య, పూజారి యాకయ్య, గడ్డం రమేష్ ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు.. ఎమ్మెల్యే రాజయ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం అశ్వరావుపల్లి ఎంపీటీసీ సుల్తాన్ దెవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. పలు కాలనీల్లో సీసీరోడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని విన్నవించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఎంపీటీసీ పేర్కొన్నారు. రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ నిమ్మ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నిమ్మ రాంరెడ్డి, రావుల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

లింగాలఘణపురం: మండలంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజయ్యను హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వపరంగా గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తానని అన్నారు.

'పూజా సామగ్రి'కి ఈ-టెండర్ ఆహ్వానం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి కిరాణ, పూజా సామగ్రి సప్లై చేసేందుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరుతున్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

జనగామ రూరల్: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. మండలంలోని సిద్దెంకిలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను ఎంపీపీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బండ లక్ష్మి వెంకటేశం, సిద్దెంకి సర్పంచ్ సుంకరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ ఘటన డివిజన్‌కేంద్రమైన ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన ఓ ఫంక్షన్‌హాల్ వద్ద చోటుచేసుకుంది. బాధిత రైతు పొన్నం కుమారస్వామికి తెలిపిన వివరాలు ప్రకారం.. ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చాలా కిందికి ఉన్నాయని, వాటిని ఎత్తుగా ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను పలుమార్లు కోరినట్లు తెలిపారు. అయినప్పటికీ స్పందించలేదని, ప్రస్తుతం వారి నిర్లక్ష్యంతో వ్యవసాయ భూమి సమీపాన గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి తన గేదె మృతిచెందిందని, దాదాపు రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

లెదర్‌పార్కుకు మోక్షమెప్పుడో ?

- రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా భవనం
- దళితులకు ఉపాధిపై పాలకుల నిర్లక్ష్యం
- శిక్షణ ఇచ్చారు.. ఉపాధి మరిచారు
- అడియాసలైన దళితుల ఉపాధి ఆశలు



నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం



మూలకుపడిన యంత్రాలు

స్టేషన్‌ఘన్‌పూర్: దళితులకు జీవనోపాధి కోసం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నామని పాలకులు చెబుతున్న మాటలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారినా, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగినా దశాబ్దాలుగా దళితులు జీవనోపాధి కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. దళితులపై పాలకుల నిర్లక్ష్యానికి మండలంలోని శివునిపల్లి శివారులో గత 20 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం నిదర్శనంగా నిలుస్తుంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని దళిత నిరుద్యోగ యువకులు, చర్మకారులకు శాశ్వతంగా జీవనోపాధి కల్పించే లక్ష్యంగా శివునిపల్లి శివారులో 2003లో టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి కడియం శ్రీహరి హయాంలో మినీ లెదర్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. లెదర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(లీడ్‌క్యాప్) ఆధ్వర్యంలో దాదాపు 25 ఎకరాల స్థలంలో మినీ లెదర్‌పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.10లక్షలతో లెదర్‌పార్కు భవనం నిర్మాణం చేశారు. అనంతరం అందులో కుట్టుమిషన్లు, ఇతర యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు లెదర్ పార్కు భవనం నిరుపయోగంగా ఉండగా భవనం శిథిలావస్థకు చేరింది.

శిక్షణ ఇచ్చారు.. ఉపాధి మరిచారు

2004లో సంబంధిత అధికారులు స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గడ్ తదితర మండలాల నుంచి చర్మ వత్తులపై కాస్త నైపుణ్యం ఉన్న 50 మంది నిరుద్యోగ దళితులను ఎంపికచేసి వారికి చెన్నైలో చర్మ ఉత్పత్తులైన లెదర్ బూట్లు, చెప్పులు, వేసుకునే కోట్లు, చేతి సంచులు, బెల్టులు, బ్యాగులు తదితర వస్తువుల తయారీలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. శిక్షణ తీసుకున్న వారిని మాస్టర్ ట్రైనర్లుగా గుర్తించి ఘన్‌పూర్‌లో వివిధ మండలాలకు చెందిన దాదాపు 500 మంది నిరుద్యోగ యువతీ, యువకులు విడతల వారిగా శిక్షణ ఇప్పించారు. దాంతో త్వరలో లెదర్‌పార్కు భవనం ప్రారంభిస్తారని, దళిత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశించారు. అయితే నాటి నుంచి నేటి వరకూ పాలకులు లెదర్‌పార్కు ఊసే ఎత్తడం లేదు.

2,000 మందికి ఉపాధి

లెదర్‌పార్కును ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2,000 మందికి జీవనోపాధి లభిస్తుంది. ఈవిషయమై దళిత సంఘాల నాయకులు, నిరుద్యోగులు పలుమార్లు సంబంధిత అధికారులు, పాలకులను కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన లేదు. గతంలో అసెంబ్లీలో ఈ విషయమై ఎమ్మెల్యే రాజయ్య ప్రస్తావించి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఇప్పటివరకూ ఎలాంటి స్పందన లేదు. దాంతో దళితులు లెదర్‌పార్కుపై ఆశలు వదులుకున్నారు.

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం



లెదర్‌పార్కు ప్రారంభం కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. ప్రారంభిస్తే రెండువేల మందికి ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా మా దళితుల తలరాతలు మారడం లేదు. లెదర్ పార్కుపై ఆశలు వదులుకొని కూలిపని చేసుకొని కుటుంబాలు గడుపుతున్నాం.

\- గాదె ఈశ్వరయ్య, స్టేషన్‌ఘన్‌పూర్

చెన్నైలో శిక్షణ తీసుకున్నాం



లెదర్‌పార్కు ప్రారంభిస్తారని తమకు 2004 సంవత్సరం చెన్నైలో శిక్షణ ఇచ్చారు. అక్కడ లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ తీసుకున్నాం. అనంతరం తాము ఇక్కడ యువకులకు శిక్షణ అందించాం. ఈ సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పనిచేయాలి.

\- చేపూరి కుమార్, ఛాగల్లు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ నాగబాబు

బచ్చన్నపేట: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు, పరుగుల మందులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నర్మెట సీఐ నాగబాబు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణ దారులు రైతులతో చెలగాటమాడరాదని అన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో కొనుగోలు చేసిన ప్రతి దానికి తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. అలాగే కాల పరిమితి అయిపోయిన మందులను కూడా విక్రయించొద్దని.. ఆ మందులను విక్రయిస్తే రైతులు పంట నష్టపోతారని అన్నారు. నకిలీ మందులు, విత్తనాలును విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏడీఓ వీణ, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, ఏఈఓలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వితంతువులకు పింఛన్ల అందజేత



పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్

నర్మెట: వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న పలువురు ఇటీవల కాలంలో మృతిచెందారు. కాగా, భర్తల మృతితో వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలమేరకు మృతిచెందిన వారి పింఛన్లను భార్యలకు (వింతంతువులకు) సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పొన్నం బాలకృష్ణ, ముక్కెర మహేందర్, కన్నెబోయిన కుమార్, బీపీఎం నిఖిత, పంచాయతీ కార్యదర్శి కానుగంటి సుకేష్, బిల్ కలెక్టర్ చిర్రవెంకట్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చర్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలకు విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని నిర్మలమాత కేథలిక్ చర్చి నిర్మాణం చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి రూ.50వేలు విరాళంగా అందించారు. హనుమకొండలోని కడియం నివాసంలో చర్చి సంఘం పెద్దలకు శనివారం సదరు విరాళం అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ ఘన్‌పూర్ నిర్మలమాత చర్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించడం సర్వత్రా అభినందనీయమన్నారు. చర్చి సంఘ పెద్దలు, గోల్డెన్ జూబ్లీ వేడుకల కమిటీ బాధ్యులు చింత జాకబ్, కడియం యువసేన నాయకులు ప్రసాద్, రవి, ఎల్లయ్య, వెంకటయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



బచ్చన్నపేట: క్రీడాకారులను సన్మానిస్తున్న నాగజ్యోతి



రఘునాథపల్లి: క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ సంతోష్, ఎస్సై రఘుపతి, ఎంపీపీ వరలక్ష్మి



జఫర్‌గఢ్: వాలీబాల్ జట్టును అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బచ్చన్నపేట: సీఎం కప్ క్రీడలలో జిల్లా స్థాయిలో ఖో-ఖోలో ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి సన్మానం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడాకారులకు సన్మానం చేసిన అనంతరం మాట్లాడారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, నాయకులు బావండ్ల కృష్ణం రాజు, క్రీడాకారులు సందీప్, సూర్య, సాగర్, కార్తీక్, రసూల్, అరవింద్, బహిరత్, సాయికుమార్, రిషి, రాంచరణ్ పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: సీఎం కప్-23 క్రీడా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రఘునాథపల్లి మండలంలోని ఐదుగురు క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శనివారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ సంతోష్, ఎస్సై రఘుపతిలు అభినందించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఎంపీడీఓ హషిం, సర్పంచ్‌లు శివకుమార్, కొయ్యడ మల్లేష్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మారపాక రాజయ్య తదితరులు క్రీడాకారులను శాలువాలు కప్పి అభినందించారు.

అభినందనలు

జఫర్‌గఢ్: సీఎంకప్‌లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో జఫర్‌గఢ్ జట్టు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పీఈటీలు కొండ రవి, యాదగిరి, సుమలత, మనో హర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఈటీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడాకారులను అభినందించారు.

చండిక అమ్మవారికి పుష్పాలతో అలంకరణ



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చండిక అమ్మవారిని శనివారం సహస్ర కలువ పుష్పాలతో అలంకరించారు. జిల్లా కేంద్రానికి చెందిన భక్తుడు కుటుంబ సమేతంగా దర్శించుకొని సహస్ర కలువ పుష్పాలను, ఇత్తడి వేలాడే దీప ప్రమిదలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, సహస్ర కలువ పుష్పాలతో విశేష అలంకరణ, నక్షత్ర హారతి సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ పార్టీ రెండో ఆత్మీయ సమ్మేళనాన్ని మండల కేంద్రంలో నేడు (ఆదివారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొడవటూర్, కేసిరెడ్డిపల్లి, భోనకొల్లూర్, బండనాగారం, కట్కూర్, లక్ష్మాపూర్, బసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట, తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల, గోపాల్‌నగర్, పోచన్నపేట, నారాయణపురం, వంగ సుదర్శన్‌రెడ్డి నగర్, ఆలింపూర్ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు అందరూ హాజరు కావాలన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉదయ భాస్కర్‌రెడ్డి

జనగామ రూరల్: పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులను డైరెక్టర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం జైమోన్ థామస్ అభినందించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డున ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పాలిసెట్‌లో యేల వరుణ్ తేజ్ 138, లిక్కి మౌర్య 182వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అభినందించిన వారిలో పీఆర్‌ఓ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణ పనులు ప్రారంభం



గుడి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రవీందర్

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి ఎస్సీ కాలనీలో పోచమ్మగుడి నిర్మాణ పనులను ఎంపీటీసీ, చిల్పూరు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంకటి రవీందర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సమ్మక్క-సారలమ్మ కమిటీ చైర్మన్ మోతె శ్రీనివాస్, మోతె దేవయ్య, నీరటి రాజు, కొలిపాక శివయ్య, బొట్టు యాదగిరి, భీమగోని పవన్, శ్రీనివాస్, డీలర్ యాదగిరి, భూక్య లాలు తేజావత్ వీరన్న పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో అనారోగ్యంతో మేస్త్రీ రాములు మృతి చెందగా శనివారం అమ్మ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిదురాల శ్రీనివాస్ సహకారంతో బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 29న మండలంలోని ఛాగల్లు శివారులో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఘన్‌పూర్ మండల క్లస్టర్-2 ఆత్మీయ సమ్మేళన సమావేశ సభా స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులందరూ ఒకే వేదికపైకి వచ్చేలా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 29న నిర్వహించే సమావేశాన్ని దిగ్విజయం చేసేలా పార్టీ శ్రేణులందరూ కంకణబద్ధులై పనిచేయాలని ఆయన కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

చిల్పూరు: లింగంపల్లి శివారు యాపలబోడు తండాకు చెందిన బి.మంగమ్మ భర్త చంద్రుకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయ నిధి అపర సంజీవనిగా పనిచేస్తుందన్నారు.

క్రికెట్ ఆటతో వాకర్లకు గాయాలు



వాకర్లను విచారిస్తున్న కానిస్టేబుల్

జనగామ: జనగామ పట్టణం బతుకమ్మకుంటలో శనివారం సాయంత్రం వాకింగ్ చేస్తున్న పలువురికి క్రికెట్ బాల్ తగిలి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అక్కడే ఉన్న వాకర్లు 100 ఫోన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అక్కడకు వచ్చి వాకర్లను ఫిర్యాదుపై వాకబు చేశారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల వరకే క్రికెట్ ఆట ముగించి, ఆ తర్వాత రాత్రి 7.30 గంటల వరకు వాకింగ్ చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బతుకమ్మ కుంటను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, కానీ ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడడం మనందరి బాధ్యత అని వాకర్లు అన్నారు.

మొక్కలను రక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట: గ్రామాల్లోని వన నర్సరీల్లో ఉన్న మొక్కలను వంద శాతం రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, రైతుల వ్యవసాయ పొలాల గట్ల మీద మొక్కలను నాటడానికి ఉచితంగా అందించాలని అన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లను పట్టాలని, చుట్టూ ముళ్ల కంచెలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్: దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని కొమ్మూరి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ దేశానికి చేసిన సేవను గుర్తుచేసుకున్నారు. మల్లారెడ్డి, సిద్దారెడ్డి, ఎంశ్రీనివాస్, నర్సిరెడ్డి, అలేటి సిద్దిరాములు, బాలకిషన్, విజయలక్ష్మి, దాసరి శేఖర్, సతీష్, లక్ష్మయ్య, గౌస్, ప్రవీణ్, కనకస్వామి పాల్గొన్నారు.

పుస్తె మట్టెల వితరణ



పుస్తె మట్టెలు అందజేస్తున్న సరిత రమేష్

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన నిరుపేద యువతి ఉల్లంగల రోజా వివాహానికి చేర్యాలకు చెందిన దాత అర్యవైశ్య దంపతులు దిడిగం సరిత రమేష్ సహకారంతో పుస్తె, మట్టెలను స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పల్లె రాజిరెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, శ్రీశైలం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సంపత్, నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీకి నోచుకోని మాదారం-ఖిలాషాపూర్ రోడ్డు

గుంతల రోడ్డుతో ప్రజలకు తప్పని తిప్పలు



గుంతల మయమైన మాదారం-ఖిలాషాపూర్ రోడ్డు

రఘునాథపల్లి: మాదారం నుంచి ఖిలాషాపూర్ వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. ప్రతీ ఎన్నికల సమయంలో బీటీ రోడ్డు మంజూరు చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. గుంతలమయమైన రోడ్డుపై ఆటోలు, బైకులు కూడా వెళ్లలేని స్థితి ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతల కారణంగా రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుంతలమయమైన మట్టి రోడ్డుపై చుట్టు పక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మిస్తే ఖిలాషాపూర్, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మేకలగట్టు, మండెలగూడెం తదితర గ్రామాలకు సాఫీగా రాకపోకలు సాగించేందుకు సౌకర్యం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.